క్లుప్తంగా

దేవి నవరాత్రోత్సవాలకు పసుపు రాట



దేవి ఆలయం వద్ద పసుపురాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మాడుగుల: మోటారు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయం వద్ద ఉత్సవాల నిర్వహణకు గాను ఆదివారం ఉదయం పసుపురాట వేశారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పుప్పాల అప్పలరాజు, జవ్వాది వరహాలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ తల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: దొండపూడిలో మోదకొండమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని సోమునాయుడు కుటుంబీకులు ఇలవేల్పుగా ఈ పండగను ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. దొండపూడి, కొత్తకోట తదితర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

పొంగలిపాకలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

మాడుగుల: పొంగలిపాకలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. దీనికి సహకారం అందించిన ఛత్రపతి శివాజీ వలంటీర్ బ్లడ్ సెంటర్ సభ్యుడు సాయికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ ఉండూరు దేముడు, సర్పంచ్ నాయిన దేముడమ్మ, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరరావు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, యూత్ సభ్యులు పి. నాగేశ్వరరావు, ఉండూరు శేఖర్, ఉండూరు గంగాధర్, సురేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

కత్తి యుద్ధంలో శిక్షణ

మునగపాక: మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం కత్తియుద్ధంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. హైస్కూల్లో పీటీగా సేవలందిస్తున్న ఎం.సూర్య శిక్షణ ఇస్తున్నారు. క్రీడారంగంలో ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కత్తి యుద్ధంలో శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూర్య కోరారు.

400 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన 115వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 289 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 73 మందికి మందులు పంపిణీ చేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, భోజనం, మజ్జిగ సమకూర్చారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భా గంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రూ.16వేలకు గణేషుడి లడ్డూ వేలం

ఎస్.రాయవరం : వమ్మవరం గణేషుడి లడ్డూ వేలం రూ.16001 పలికింది. స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో నిలిపిన బొజ్జ గణపయ్యకు 21 రోజుల పాటు పూజలందించి ఆదివారం అనుపోత్సవం నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రాయి రామరాజు అత్యధికంగా వేలంపాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

‘మార్గం’ సుగమం

- రెండు జిల్లాలను కలుపుతూ తారురోడ్డు నిర్మాణం
- ఇరువైపులా సీఎస్‌ఆర్ నిధులతో మొక్కల పెంపకం
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో పరిష్కారం
- వాహనదారుల ఆనందం



నాడు అధ్వానంగా పింద్రంగి-వై జంక్షన్‌లో మట్టి రోడ్డు



రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటిన సోషల్ ఫారెస్ట్



పింద్రంగి-ముసిరాం, కొత్తభూమి ప్రాంతాలను కలుపుతూ వై-జంక్షన్ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం



నేడు సుందరంగా దర్శనమిస్తున్న పింద్రంగి-వై జంక్షన్ తారురోడ్డు

కె.కోటపాడు: మండల శివారు కొత్తభూమి, పింద్రంగి గ్రామాల మీదుగా విజయనగరం జిల్లా ముషిరాం గ్రామానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో తారురోడ్ల నిర్మాణం పూర్తయింది. మండలానికి చెందిన పలువురు విజయనగరం జిల్లాకు వెళ్లాలంటే ఆనందపురం, లంకవానిపాలెం మార్గమే గత్యంతరమయ్యేది. ప్రస్తుతం పింద్రంగి నుంచి వై జంక్షన్ వరకు 1,800 మీటర్లు, విజయనగరం జిల్లా ముషిరాం నుంచి కె.కోటపాడు మండలం కొత్తభూమి వరకు రెండు కిలోమీటర్ల మేర మట్టిరోడ్డును తారురోడ్డుగా నిర్మించారు.

మట్టిరోడ్లపై ప్రయాణాలకు అష్టకష్టాలు

పింద్రంగి, కొత్తభూమి గ్రామాల ప్రజలు విజయనగరం ప్రాంతానికి వెళ్లాల్సిన సమయంలో చిన్నపాటిగా మట్టిరోడ్డులో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వర్షాకాలంలో మట్టిరోడ్డు పూర్తిగా ఛిద్రమై గోతులు ఏర్పడ్డాయి. అందులో వర్షపు నీరు నిలిచిపోయేది. పలు చోట్ల గెడ్డ నీరు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడేవారు.

ఆర్నెల్లలో తారురోడ్డు నిర్మాణం పూర్తి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి పింద్రంగి, కొత్తభూమి గ్రామాల ప్రజలు ముషిరాం వైపు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను తీసుకువెళ్లారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పింద్రంగి నుంచి వై-జంక్షన్ వరకు 1,800 మీటర్ల మేర మట్టిరోడ్డును తారురోడ్డుగా నిర్మించేందుకు రూ.2 కోట్లు, విజయనగరం జిల్లా ముషిరాం నుంచి కె.కోటపాడు మండలం కొత్తభూమి వరకు రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డుగా నిర్మించేందుకు రూ.2 కోట్లు మంజూరు చేశారు. పింద్రంగి-వై.జంక్షన్ మధ్య మంజూరు చేసిన నిధులతోనే పొట్టి అచ్చన్న నుయ్యి వద్ద పైపు కల్వర్టు, వై-జంక్షన్, గొర్లి వారి గరువు, పైడితల్లమ్మ ఆలయం సమీపంలోను, జాగరపు వారి కళ్లాల వద్ద రోడ్డులో వర్షపునీరు ప్రవహించేందుకు కల్వర్టులను నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆర్నెల్లకే పూర్తి కావడంతో ప్రజలంతా కృతజ్ఞతలు చెబుతున్నారు. రెండు మార్గాలకు ఇరువైపులా సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలను పెంపకానికి చర్యలు తీసుకున్నారు.

సుదీర్ఘ కల సాకారం



ముషిరాం నుంచి పింద్రంగి, కొత్తభూమి గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డు తారురోడ్డుగా పూర్తవుతుందని ఊహించలేదు. సుదీర్ఘ కాలం నాటి సమస్య పరిష్కారం కావడంతో ఆనందంగా ఉంది.

– మీసాల మంగమ్మ, ముషిరాం, విజయనగరం జిల్లా

24 అడుగుల వెడల్పుతో రోడ్డు



గతంలో పింద్రంగి నుండి వై-జంక్షన్‌కు వెళ్లే మార్గంలో ఎనిమిది నుంచి పదడుగుల వెడల్పుతో మట్టి రోడ్డు ఉండేది. ప్రస్తుతం 24 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ జరిగింది. తారురోడ్డును 12 అడుగుల వెడల్పుతో వేయగా, మరో 12 అడుగుల రోడ్డుకు రెండు వైపులా బెర్ములుగా ఏర్పాటు చేశారు.

– నెక్కల గోపి, ఎంపీటీసీ, పింద్రంగి

రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం



పింద్రంగి-వై.జంక్షన్, ముషిరాం-కొత్తభూమి గ్రామాల మధ్య తారురోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాం. సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో ఎన్‌టీపీసీ నిధులతో నాలుగు కిలోమీటర్ల మేర మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తి చేశాం.

– చిరికి గోవింద, వనసేవకుడు

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న కరణం ధర్మశ్రీ, పార్టీ శ్రేణులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో ఆదివారం వడ్డాదిలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి పార్టీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. రావికమతం మండలం కొత్తకోటలో సమావేశానికి వెళ్తుండగా మార్గం మధ్యలో ఆయనకు ధర్మశ్రీతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు ఆహ్వానం పలికారు. జెడ్పీటీసీ దొండ రాంబాబు, వైస్ ఎంపీపీ దొండ లలిత నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, యేనుయుల వాసు తదితరులు దుశ్శాలువతో సత్కరించారు.

సాంకేతిక విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని వినతి



మంత్రి బొత్సకు సమస్యలు వివరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ బృంద సభ్యులు శ్రీనివాసరావు

మాడుగుల: విద్యాపరంగా వెనుకబడిన మాడుగుల నియోజకవర్గంలో ఇంత వరకు సాంకేతిక విద్యా సంస్థ లేదని నియోజకవర్గ ఉద్యోగ, ఉపాధ్యాయ బృంద సభ్యుడు చిరికి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కె.కోటపాడు మండలం మర్రివలస గ్రామానికి విచ్చేసిన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో కలిసి నియోజకవర్గంలో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సమస్యను పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి బృంద సభ్యుడు శ్రీనివాసరావు తీసుకెళ్లారు. అనంతరం దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో భారీ అన్నసమారాధన



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మను సత్కరిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి: వినాయక మహోత్సవాల్లో భాగంగా స్థానిక పెదరాయ సెంటర్‌లో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు హాజరై వడ్డన చేసి అన్నదానం ప్రారంభించారు. అనంతరం వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ యూత్ సభ్యులు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి డిప్యూటీ సీఎం సతీమణి రమణమ్మను శాలువాతో సత్కరించి, వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి విలేకరులు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న విలేకరుల సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఏపీడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ విలేకరులు రాసే వార్తలు ప్రజలకు ప్రభుత్వానికి మేలు చేసేవిగా ఉండాలన్నారు. విలేకరులకు తన అండదండలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం ధర్మశ్రీని, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ యవజన ప్రతినిధి, కన్నడ హీరో గొందు సిద్దును యూనియన్ నాయకులు సిహెచ్.బి.ఎల్.వి.స్వామి, నానాజీ, విలేకరులు బి.ఆనంద్, జి.తమ్మునాయుడు, కశిరెడ్డి రమణ, కృష్ణ, ఈశ్వరరావు, సలీం ఘనంగా సత్కరించారు. విలేకరుల అభ్యర్థన మేరకు తన నియోజకవర్గం పరిధిలో ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని ధర్మశ్రీ హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు రామకోటి, చంద్ర, కిశోర్, రాంబాబు, చిన్నంనాయుడు, ఆరు మండలాల విలేకరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



ట్యూషన్ టీచర్ దంపతులతో పూర్వ విద్యార్థులు

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఇక్కడ 1992–94 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించిన 70 మంది విద్యార్థులంతా కె.కోటపాడు మండలం చౌడువాడ వద్ద రిసార్ట్స్‌లో కలుసుకున్నారు. వీరిలో అప్పుడప్పుడూ కొంతమంది కలుసుకుంటున్నప్పటికీ తాజాగా అంతా ఒకసారి, ఒకచోట చేరడంతో ఒక్కసారిగా సందడి వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో విద్యాభ్యాసం రోజుల్లోకి జారుకుని, ఆనాటి ముచ్చట్లతో కాలాన్ని కరిగిస్తూ, కష్టసుఖాలను పంచుకుంటూ వయసు మీద పడినా వారింకా ఆనాటి సహ విద్యార్థులే అన్నంతగా కలసిపోయారు. ఆనాటి స్నేహ మాధుర్యాన్ని తిరిగి చవిచూస్తూ, వర్తమానంలో ఎవరెవరు ఎలా స్థిరపడ్డారు, వారివారి పిల్లల సంగతేంటి అన్న విషయాల ముచ్చట్లలో మురిసిపోయారు. అప్పట్లో తమకు ట్యూషన్ చెప్పిన బ్రహ్మం మాష్టారు దంపతులను తగురీతిలో సత్కరించుకుని తమ గురుభక్తిని చాటుకున్నారు. కార్యక్రమం నిర్వహణలో ప్రధాన పాత్రధారులైన వై.లోవరాజు, జి.నారాయణమూర్తి, డి.సత్య, ఎం.శ్రీను, వై.సత్యనారాయణలతోపాటు సువర్చల, మంజు తదితరులు ఇన్నేళ్ల తర్వాత కలుసుకున్నా ఆనాటి తొలి కలయిక మాదిరిగానే ఈ అనుభవం ఎంతో బాగుందని సంతోషించారు. బంధువులు, బలగం ఎంతమంది ఉన్నా సరే సహ విద్యార్థులు.. స్నేహితుల సాటి ఆప్యాయతానురాగాలు పొందడం వేరే లెవల్ అంటే నిజమే మరి.

వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా యల్లపు



శివను శాలువాతో సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా యల్లపు సాంబశివరావు(శివ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా భీశెట్టి రామకృష్ణ, కోశాధికారిగా రాపేటి నారాయణరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ 2024 ఏడాదికి ఎన్నికైన ఈ నూతన కమిటీ ఏడాదిపాటు మనుగడలో ఉంటుందన్నారు. కమిటీ సభ్యుల సహకారంలో క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన శివను క్లబ్ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు కేవీ గౌరీపతి, బీవీ రమణ, నల్లల దేముళ్లు, బుద్ధ అప్పారావు, ఎస్.నూకరాజు, బుద్ధ శ్రీనివాసరావు, చవితిని నర్సింగరావు, బొడ్డేడ శేషు తదితరులు పాల్గొన్నారు.

నేడు శరీర, అవయవ దాతల సంఘ వ్యవస్థాపక వేడుకలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ యల్లపు ఉమామహేశ్వరి ఇంటి ఆవరణలో సోమవారం సాయంత్రం 4 గంటలకు శరీర, అవయవ దాన వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జి.సీతామహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, జిల్లా ఖజానాశాఖ అధికారి వీవి సుభాషిణి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

కొత్తపాలెం వద్ద ఇసుక డిపో ప్రారంభం



డిపోలో జేసీబీతో ఇసుక లోడింగ్

మాకవరపాలెం: కొత్తపాలెంలో ప్రభుత్వ ఇసుక డిపో ప్రారంభించారు. మండలంలోని జగనన్న కాలనీల లబ్ధిదారులకు ఇప్పటివరకు నర్సీపట్నం మండలం గబ్బాడ వద్ద డిపో నుంచి ఇసుకను సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించి గృహ నిర్మాణ శాఖ అధికారుల సూచనతో కొత్తపాలెం వద్ద ఇసుక డిపో ఏర్పాటుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. మొదటగా 400 టన్నుల ఇసుక ఇక్కడ డిపోకు చేరడంతో ఆదివారం నుంచి రాచపల్లి, రామన్నపాలెం, జి.కోడూరు, తదితర గ్రామాల లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథం తెలిపారు.

ముందస్తుగా పశువులకు టీకాలు



జిల్లేడుపూడిలో పశువుకు టీకా వేస్తున్న గోపాలమిత్రుడు కిల్లాడ వెంకటరమణ

నాతవరం: పశువులకు గాలికుంటు, లంపీ స్కిన్ రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామని గోపాలమిత్రులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ తెలిపారు. ఆయన ఆదివారం జిల్లేడుపూడి లక్ష్మీపురం ఆర్.వెంకయ్యపాలెం, గోవిందపురం గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన వ్యాక్సిన్లు పశువులకు వేసి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల వారీగా పశువులకు గాలికుంటు, లంపీస్కిన్ రాకుండా వ్యాక్సిన్లు సరఫరా చేసిందన్నారు. ఆయా వ్యాక్సిన్లు పాయకరావుపేట వెటర్నరీ ఏడీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రైతుల కల్లాలు వద్దకే వెళ్లి పశువులకు వేస్తున్నామన్నారు. సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులకు తెలియజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 198 మంది గోపాలమిత్రులు ఈ వ్యాక్సిన్లు వేస్తున్నారన్నారు. వీటితోపాటు పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహన్‌రావు ఆదేశాల ప్రకారం కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేస్తున్నామన్నారు.

సర్వకామదాంబకు నిమ్మకాయల పూజ



ప్రత్యేక అలంకరణలో సర్వకామదాంబ అమ్మవారు



సామూహిక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారికి నిమ్మకాయల పూజ నేత్రపర్వంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కనకదుర్గమ్మ మాలధారణ, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామార్చన, విజయదశమి రోజున జమ్మి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

విజేతగా నిలిచిన అల్లూరి జట్టు



జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన అల్లూరి జట్టు

యలమంచిలి : మండలంలో పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం అర్ధరాత్రితో ముగిశాయి. అత్యంత రసవత్తరంగా జరిగిన ఫైనల్ పోటీలలో అల్లూరి జిల్లా, గంగవరం జట్ల మధ్య జరిగిన పోరులో అల్లూరి జిల్లా జట్టు ప్రథమ స్థానం, గంగవరం జట్టు ద్వితీయ స్థానం, సోమలింగపాలెం జట్టు తృతీయ స్థానం దక్కించుకున్నాయి అని ఉత్సవ కమిటీ సభ్యులు మొగలిపల్లి గణేష్, చంద్రగిరి నాని ఆదివారం తెలిపారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో హోరాహోరీగా జరిగిన ఈ పోటీలు తిలకించడానికి రెండు గ్రామాల ప్రజలు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో మొదటి స్థానం పొందిన జట్టుకు రూ.15 వేలు నగదు, ద్వితీయస్థానం జట్టుకు రూ.12వేలు, తృతీయస్థానం జట్టుకు రూ.10వేలు బహుమతులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల శివ, మొగ్గా గోవిందరావు, ఊటకూటి శేఖర్, జెర్రిపోతుల వెంకట్, ఊటకూటి బాబ్జి, ఊటకూటి రాజీవ్, మొల్లి అప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. గాజువాక, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, దీపాంజలినగర్ వంటి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఆదివారం రెండు బీచ్‌లు కళకళలాడాయి. పర్యాటకులు తీర ప్రాంతాల్లోని జీడి, సరుగుడు తోటల వద్ద గడిపి అనంతరం బీచ్‌ల్లో ఇసుక మేటల్లో ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో కేరింతలు కొట్టారు. తిక్కవానిపాలెం బీచ్‌లో తాగునీటి సదుపాయం లేక సందర్శకులు అవస్థలు పడుతున్నారు. ముత్యాలమ్మపాలెం తీరంలో నీడ ఉండేలా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.